# కంటిసాకు అను అజాతమిత్రుని కథ

ముక్కంటి యాభై ఆరేళ్ళ కిందట ఈ భూమ్మీద పడ్డాడు. మొత్తం ముప్పయ్యేళ్ళ సర్వీసులోనూ ఎల్డీ, యూడీ, ఆఫీసు సూపరింటెండెంట్ వరకూ ఎదిగినా బుద్ధి మాత్రం ఎదగలేదు. హోదాని బట్టి ఆఫీసు సూపరింటెండెంట్ అయినా నిజంగా చేస్తున్నది మాత్రం కాకాసురత్వం. ఆనాడు శ్రీరామచంద్రుడు జాలి కలిగి కాకాసుర సంహారం చేయకుండా ఒక్క కన్ను మాత్రమే లాక్కుని విడిచేసినందుకు నాటి కాకాసుర సంతానం ఈనాడు బీజోపబీజాలుగా విస్తరించి, ప్రభుత్వ పాలనా యంత్రాంగంలోకి దూసుకుపోయింది.

ముక్కంటి అని తల్లిదండ్రులు నామకరణం చేసినా ఉన్నవి రెండే కళ్ళు. ఉన్న సర్వీసు కూడా రెండే ఏళ్ళు. ఒక ఇంటికి అంతర్కుసుమలు వేశాయి. ఆపరేషన్ చేయించుకోవాలని ఒక సంవత్సరం, ఆ తర్వాత రెండో కంటి క్కూడా కుసుమలు వేశాయి అవికూడా ఆపరేషన్ చేయించుకోవాలవని రెండో సంవత్సరం గడిపేస్తే, మెల్లగా ఈ రెండేళ్ళూ అలవాటు పడిన కాకాసురుడి పదవిలోనే కొనసాగుదామని ముక్కంటి ప్లాను.

ముక్కంటి కంటి సాకుతో పని చేసీ చేయనట్లు కాలక్షేపం చేస్తూ తన కింది ఉద్యోగులకు మాత్రం ఏవో సాకులతో ఆ పని అవలేదు ఈ పని అవలేదంటూ సంజాయిషీ నోటీసులు, కాషన్ మెమోలు రాసేస్తున్నాడు.

నవతరానికీ, యువతరానికీ ప్రతీకలైన ఎల్డీ. యూడీలు అంటే జూనియర్ అసిస్టెంట్లు, సీనియర్ అసిస్టెంట్లు ముక్కంటి చేసే వెధవన్నర వెధవ పనులకి స్పీడు బ్రేకర్లుగా పని చేద్దామని సమయం కోసం ఎదురుచూస్తున్నారు.

ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో తమిళుడైన ఒక ఉన్నతాధికారి కుంభకోణం నుంచి బదిలీ మీద గుంటూరు వచ్చాడు. అతని ఆఫీసులో ఒక గుమాస్తా పోస్టు ఖాళీ అయింది. ఆ పోస్టుకి అర్హులైన అనేక మంది స్థానిక అభ్యర్థులు దరఖాస్తు చేశారు. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల నుంచి కూడా అర్జీలు వచ్చాయి. అయితే ఎవరికో ఒకరికే కదా ఉద్యోగం వచ్చేది? ఒక్కడికే ఉద్యోగం వచ్చింది. ఆ ఒక్కడూ కుంభకోణం నుంచీ గుంటూరులో జాయినయ్యాడు.

మూడేళ్ళు గడిచేక ఆ ఆఫీసులో ఒక సూపరింటెండెంట్ రిటైరయ్యాడు. అతని ఖాళీలో ఒక యూడీసీ ప్రమోట్ అయ్యాడు. ఆ యూడీసీ ఖాళీలో ఈ కుంభకోణం ఎల్డీసీ ప్రమోట్ అయి యూడీసీ పోస్టు ఖాళీ అయింది. సైకిల్ చక్రం తిరిగి గాలి కొట్టే రంధ్రం దగ్గరకే వచ్చింది.

కుంభకోణం అధికారి ఆ గుమాస్తాగిరికి ధరఖాస్తులు స్వీకరిస్తామంటూ ప్రకటనలు చేశాడు. రాష్ట్ర వ్యాప్తంగా దరఖాస్తులు వచ్చాయి. కాని మళ్ళా కుంభకోణం వాస్తవ్యుడికే ఉద్యోగం వచ్చింది. గుంటూరు వాస్తవ్యులైన నిరుద్యోగులు "ఒరేయ్! ఇదీ ఆ కుంభకోణమేర్రా!" అన్నారు. అప్పట్నుంచీ ఈ కుంభకోణం అనీ, ఆ కుంభకోణం అనీ అనేకమైన స్కాండల్స్‌కి ఆ పేరు బహుళ ప్రచారంలోకి వచ్చింది.

అలాగే ఇప్పుడు ఆఫీసు సూపరింటెండెంట్ ముక్కంటి ఒక గుమాస్తాకి ఇంక్రిమెటు బకాయిలు చెల్లించినప్పుడు పది శాతం కమీషన్ పుచ్చుకున్నాడని ఒక 'ఆకాశరామన్న' విజిలెన్స్ అధికార్లకి లేఖ రాశాడు. ఒక విజిలెన్స్ అధికారి దర్యాప్తుకి వచ్చాడు. ముక్కంటిని పిలిచాడు.

"మీరు పతితపావనరావుకి ఇంక్రిమెంటల్ ఎరియర్స్ ఇచ్చినపుడు టెన్ పర్సంట్ కమిషన్ పుచ్చుకున్నారని మీ మీద అభియోగం. అందుకు మీ సంజాయిషీ?

"అది వట్టి అబద్ధం సార్! నా మీద అసూయ కొద్దీ ఎవడో అలా రాశాడు" అన్నాడు ముక్కంటి.

"ఎవడికి మీరంటే కిట్టదో ఆ వ్యక్తి పేరు చెప్పగలరా?"

"చెప్పలేను సార్! పని దొంగలైన కింది ఉద్యోగులందరికీ పని సామర్థ్యం పెంపుదలకై సమష్టిగానే ఆకాశరామన్న ఉత్తరం రాసుంటారు!" అన్నాడు ముక్కంటి.

"దీన్ని బట్టి చూస్తే మీరు అజాతమిత్రుడిలా ఉన్నారే! సరే-మీ స్టేట్‌మెంట్ రాసిచ్చెయ్యండి" అన్నాడు విజిలెన్స్ అధికారి.

ముక్కంటి స్టేటమెంట్ రాసిచ్చాడు.

గుమస్తా పతితపావనరావుని రమ్మన్నాడు విజిలెన్స్ అధికారి.

"మీ ఇంక్రిమెంట్ ఎరియర్స్ బిల్లు పాస్‌చేసి ట్రెజరీకి పంపించినందుకు సూపరింటెండెంట్ ముక్కంటి గారికి మీరు టెన్‌పెర్సెంటు కమిషన్ ఇచ్చారని మీ మీద అభియోగం. అందుకు మీ సమాధానం?" అడిగాడు విజిలెన్స్ అధికారి

"అది వట్టి బూటకం సార్! నే నెవరికీ ఏమీ ఇవ్వలేదు" అన్నాడు పతితపావనరావు.

"నిజం చెప్పండి. మొహమాటం వొద్దు. నిజం చెప్తే ముక్కంటిగారు మిమ్మల్నేదో చేసేస్తారని భయపడకండి. ఇక్కడెవరూ లేరు కదా!" ధైర్యం చెప్పేడు విజిలెన్స్ అధికారి.

నిజంగా ఎవరైనా తమ పనులు సజావుగాను, నిరాటంకంగానూ సాగిపోవడానికి ఆ సీటు డీలు చేస్తున్న వ్యక్తికి ఏదో ఇచ్చుకుంటారు. అది ధన రూపేణా కావచ్చు. వస్తు రూపేణా కావచ్చు. దానికి లంచం అని పేరు పెట్టొచ్చు, ఇచ్చినవాడు ఇచ్చినట్టు ఎప్పుడూ ఒప్పుకోడు అది కూడా నేరమే కనుక! చచ్చినట్టు ఇవ్వలేదనే అంటాడు. అలాగే పతితపావనరావును.

"నాకు భయమెందుకు సార్! నిజంగా నేనెవరికీ ఏమీ ఇవ్వలేదు" అన్నాడు పతితపావనరావు.

"ఎవరికీ ఏమీ ఇవ్వలేదంటున్నారు. నేనడుగుతున్నది ముక్కంటి గారిని గురించి. అదైనా ఏ ముక్కంటో కాదు. మీ ఆఫీసు సూపరింటెండెంట్ ముక్కంటి గురించి. అతనికి మీరు పది శాతం కమిషన్ ఇచ్చారా అని అడుగుతున్నాను" అడిగాడు విజిలెన్స్ అధికారి.

"నేను ఆఫీసు సూపరింటెండెంట్ ముక్కంటిగారికి పది శాతం కమిషన్ ఇవ్వలేదు. నా ఇంక్రిమెంట్ ఎరియర్స్ బిల్లు ఉచితంగానే పాస్ చేశారు!" నొక్కి వక్కాణించాడు పతితపావనరావు.

"సరే అయితే - అలాగే మీ స్టేట్‌మెంట్ రాసి ఇవ్వండి" అన్నాడు. విజిలెన్సాఫీసరు.

పతితపావనరావు స్టేట్‌మెంట్ రాసిచ్చాడు.

ముక్కంటి సుళువుగా రెండేళ్ళూ గడిపేద్దామనుకున్నాడు. కాని గడవడం కష్టమవుతూంది. విజిలెన్సాఫీసరు వేధింపు ప్రశ్నలకి మానసిక క్షోభకు గురయ్యాడు.

కుడికన్ను నొప్పిగా ఉందని ఏడీగార్కి చెప్పి నాల్రోజులు సెలవు పెట్టి ఉడాయించాడు. రిజిస్టర్డ్ పోస్టులో మరో మూడు మాసాలు సెలవు పొడిగిస్తూ ఎమ్ సీ జత చేస్తూ మంజూరు చేయవలసిందిగా విజ్ఞప్తి చేశాడు.

ఆఫీసులో గుమస్తాలు ముసి ముసి నవ్వులు నవ్వుకున్నారు. సాయంత్రం బార్‌లో 'చీర్స్' అంటూ గ్లాసులు ముద్దులాడుకున్నాయి.

ఆఫీసు ప్రశాంతంగా ఉంది.

క్వెరీ మాస్టర్ జనరల్ అయిన ముక్కంటి లేకపోవడం వల్ల కాయితాలు ఏడీగారు డైరెక్టుగా చూస్తున్నారు.

"ఊర్ధ్వ మూలం అథశ్శాఖం అశ్వత్థం ప్రాహురవ్యయం" అని కృష్ణ భగవానుని ఉవాచ, అశ్వత్థ వృక్షం కొమ్మలు అథోముఖంగాను, వేళ్ళు ఊర్ధ్వముఖంగానూ ఉంటాయట.

అథోముఖంగా పడి ఉన్న ఫైళ్లు ఊర్ధ్వభాగానికి వచ్చి ప్రగతి పథంలో పయనం ప్రారంభించాయి.

మూడు నెలల సెలవు పూర్తయిన తర్వాత, మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికేట్ తీసుకుని జాయినయిందే తడవుగా ముక్కంటిని మరికొన్ని అనుబంధ ప్రశ్నలు వేయాలంటూ విజిలెన్స్ అధికారి ప్రత్యక్షమయ్యాడు. 'చచ్చాన్రా భగవంతుడా, మిగిలిన ఏడాది తొమ్మిది నెలల సర్వీసు సక్రమంగా పూర్తవుతుందా, ఈ లోపునే సస్పెండవుతానా' అని బెంగపడిపోయాడు ముక్కంటి. అనుబంధ ప్రశ్నలకి తనకి తోచిన విధంగా సమాధానం చెప్పాడు. కాని మానసిక రుగ్మతకి మందేదీ?

పట్టుమని పదిరోజులైనా సీట్లో కూచున్నాడో లేదో, మళ్ళా ఎడమ కంటికి అంతర్కుసుమలు వేశాయంటూ హడలిపోయి పలాయనం చిత్తగించాడు ముక్కంటి.

అంతర్కుసుమలని ఎందుకొచ్చారని ఏడీగారడిగితే-"ఇంకా ముదరలేదన్నారండీ డాక్టరుగారు. అందాకా డ్రోసిన్ డ్రాప్స్ వేస్తుండమన్నారు" అంటూ సమాధానం చెప్పాడు ముక్కంటి. ఏడీగారికి లీవ్‌లెటరిచ్చేసి వెళ్ళిపోయాడు.

కాలచక్రం మళ్ళీ తిరిగింది. ఆఫీస్ గుమాస్తాల అభినందనం. బార్‌లో బీర్ సేవనం.

రిజిస్టర్డు పోస్టులోమూడు నెలలు మెడికల్ లీవ్ ఎక్స్‌టెన్షన్ వచ్చింది.

పెద్దాసుపత్రిలో ఉన్న కంటి వైద్య నిపుణునికి ముక్కంటి కేసు రిఫర్ చేద్దామని ఏడీగారనుకున్నారు గాని, పోనీ ఎలాగూ ఏణ్ణర్థంలో రిటైరయిపోతాడు కదా అని సానుభూతితో ఒక పక్కా, ఇతను లేకపోవడం వల్ల 'కార్యాలయంలోని కాయితాల కదలికలో కాస్త వేగిరపాటు ఉందికదా అని మరొక పక్కా యోచించి, ఆ ఆలోచన విరమించుకున్నారు.

రెండోసారి కూడా మూణ్ణెల్లు గడిచేక, ఫిట్‌నెస్ సర్టిఫికేట్ తీసుకుని జాయినవడానికి బయలుదేరేడు ముక్కంటి. బస్సెక్కేడే గాని, తను కూచున్న బస్సు ఎదురుగా వస్తున్న ఎన్నో బస్సుల్నీ లారీల్నీ తప్పించుకుంటూ-ఎత్తుపల్లాలు గాను, ఒడిదుడుకులు గానూ ఉన్న రోడ్డుపై పయనిస్తున్నట్టు- తనూ ప్రయాణిస్తున్నాడు, పాత పోస్టులోనే కొత్తగా జాయినవబోతున్న ముక్కంటి. జాయినయిన తరువాత మళ్ళా విజిలెన్స్ యముడు మరికొన్ని ఉప ప్రశ్నలు వేయాలంటూ ఒకవేళ ప్రత్యక్షమైతే? ఏమిటి దారి? 'ముక్కంటి' అని తనవాళ్ళు బారసాల చేసినా-తనకున్నవి రెండే కళ్ళు! మొదటి ఒక కంటికి, తరువాత రెండో కంటికి అంతర్కుసుమలు వేశాయని, తన కింది ఉద్యోగుల వెక్కిరింపుల నుంచి కంటిసాకులతో తప్పించుకోవడం ఎలాగ? అందుకే బస్సులోనే రెండుకళ్ళూ మూసుకుని, తన పేరు గల భగవంతుని మూడో కంటిలోని అగ్నిహోత్రాన్ని ఉపసంహరించుకునీ, ఆ మూడో కంటిని తనకు తాత్కాలికంగా దానం చెయ్యమని ఆ బేసి కంటివాణ్ణి ప్రార్థిస్తున్నాడు, దానిక్కూడా అంతర్కుసుమలు వేశాయని చెప్పడానికి!

ఆంధ్రప్రభ వీక్లీ 11-2-87